E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 23-02-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:53|| పేజీలు–6 www.ekaburu.com




**డిజిటల్ విప్లవం: క్యాష్‌కు చెక్.. యూపీఐదే హవా!**

.. 4లో

---

## ప్రాజెక్టులు పూర్తి చేసి
## రాష్ట్రాన్ని సస్యశామలం చేస్తాం

- గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుంది
- గత పాలనలో ప్రాజెక్టులు పూర్తి చేస్తే వివాదమే ఉండేది కాదు
- గోదావరి జలాలపై సూచనలిస్తే..స్వీకరిస్తాం
- జలాల విశయంలో ఏపీ కి సహకరిస్తున్నామనేది అసంబద్ధం : రేవంత్‌రెడ్డి



**ఈ కబురు, కన్నాయిగూడెం:**
గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే వివాదమే ఉండేది కాదన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, జిల్లా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు కట్టి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు.'

తరువాయి 2లో

---



## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు
# ఆశ్చర్యపోయాయి

- భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగం
- ప్రపంచ స్థాయి నాణ్యతను దృష్టిలో పెట్టుకొని వస్తువుల ఉత్పత్తి, సేవలు ఉండాలి
- 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్... చిన్నారి నలుగురికి జీవనదాత
- 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో... భారత ప్రధాని మోదీ వ్యాఖ్య

**ఈ కబురు :**

"భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏఐ సమిట్‌లో ముఖ్యంగా రెండు భారత ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. జంతువుల చికిత్సకు.."

టిని ట్రాక్ చేయడానికి ఏఐ(AI)ను వినియోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని ప్రధాని అన్నారు. ఆదివారం 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధన, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. మన యువత తమ ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలను తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని ప్రశంసించారు. ఈ సదస్సు ద్వారా వివిధ దేశాల నేతలకు, టెక్ దిగ్గజాలకు మన యువత ప్రతిభను, నూతన ఆవిష్కరణలను స్వయంగా చూపించే అవకాశం లభించిందన్నారు.

తరువాయి 2లో

---



3

## అత్యంత వేగవంతమైన మెట్రోను ప్రారంభించిన మోదీ

**ఈ కబురు :**
అభివృద్ధి ప్రాజెక్టులకు పునాది అనంతరం వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు భాజపా ప్రభుత్వం రేయింబవళ్లు పని చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగా ప్రాజెక్టుల్లో దీర్ఘకాలం జాప్యం ఉండదని, శంకుస్థాపన చేసిన తన చేతులతోనే ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయని అన్నారు.

---



2

## ఎవరూ అధైర్యపడొద్దు..

- బీఆర్ఎస్ అండగా ఉంటుంది.. మూసీ బాధితులకు సబితా ఇంద్రారెడ్డి భరోసా

ఈ కబురు ; గాంధీ సరోవర్ పేరిట మధు పార్క్ అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం నాడు పరామర్శించారు

---



6

## టీమిండియా ఘోర పరాజయం

టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 పోరులో టీమిండియాకు ఘోర పరాజయం ఎదురైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 76 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది.

---

## పేదల ఇళ్లు కూల్చి..బడా బాబులకు
## భూములు కట్టబెట్టే కుట్ర

**ఈ కబురు, హైదరాబాద్**
: మూసీ సుందరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.

.... 2లో



---

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
## ముగ్గురు ఉగ్రవాదుల హతం

**ఈ కబురు :**
జమ్మూకశ్మీర్‌లోని కిష్త్‌వాడ్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. వారికి జైషే మహమ్మద్‌తో సంబంధం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని చెప్పారు. భద్రతా ఏజెన్సీల ప్రాథమిక అంచనాల ప్రకారం మృతుల్లో ఒకరిని జైషే మహమ్మద్ కమాండర్ సైపుల్లాగా భావిస్తున్నట్లు తెలిపారు.



తరువాయి 2లో

---

## మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు



.... 2లో

---

## కృష్ణా, గోదావరి జలాల్లో
## ఒక్క చుక్క వదులుకోం

**ఈ కబురు, ములుగు:**
కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోకుండా తెలంగాణ హక్కులు కాపాడతామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

.... 2లో



---

## బోడులో కీడు ఉందని.. ఊరంతా ఖాళీ

.... 2లో



**ఈ కబురు, టేకులపల్లి**
ఊరంతా ఒకరోజు ఊరుబయట గడుపుతారట.. ఇదేంటి అనుకుంటున్నారా అది నిజమే.. ఆ ఊరికి ఏదో కీడు శంకిస్తుందని ఆ గ్రామస్తుల నమ్మకం.

---

## ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?
## కేంద్రమంత్రి బండి సంజయ్

**ఈ కబురు, హైదరాబాద్:**
ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేయడమేంటని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందా?

.... 2లో



---

## దేశంలో దాడులకు ప్రణాళికలు..
## ఉగ్రముఠా అరెస్టు



**ఈ కబురు ;**
సమాజంలో అత్యంత కిరాతకమైన, హేయమైన నేరానికి పాల్పడిన ప్రభుత్వ అధికారికి, ఆయన భార్యకు కోర్టు మరణశిక్ష విధించింది

.... 2లో

---

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు
# రామచందర్‌రావు అరెస్ట్

- రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్బంధకాండ కొనసాగుతోంది
- ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా, అప్రజాస్వామికంగా అరెస్టులు
- నిప్పులు చెరిగిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు



**ఈ కబురు, హైదరాబాద్**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్బంధకాండ కొనసాగుతోంది. ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా, అప్రజాస్వామికంగా అరెస్టులు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు చెప్పిందే వినాలి, వారి ఇష్టానుసారంగా నడుచుకోవాలనేలా వ్యవహరించడం సిగ్గుచేటని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు.బాన్సువాడ, కామారెడ్డి పర్యటన నేపథ్యంలో నన్ను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడం పూర్తిగా అక్రమం, అన్యాయం. శాంతియుతంగా బాన్సువాడ వెళ్లి మా ఎమ్మెల్యేకు సంఘీభావం తెలియజేయాలనుకున్న నన్ను వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం మని దుయ్యబట్టారు.

.... 2లో

---

## ఏఐ అతిగా వాడితే
# ప్రమాదమే!

- దాంతో వేగంగా చేయడం నైపుణ్యం కాదు
- ఆ సమాచారాన్ని గుడ్డిగా నమ్మకూడదు
- ఉన్నతవిద్య విద్యార్థుల్లో 'ఏఐ వినియోగం'పై అధ్యయనం



**ఈ కబురు, హైదరాబాద్**
కృత్రిమ మేధను ఒక ప్రత్యామ్నాయంగా కాకుండా భాగస్వామిగా చూడాలని ఓ అధ్యయన నివేదిక వెల్లడించింది. ఏఐతో వేగంగా చేసే పనులను సొంత నైపుణ్యంగా భావించకూడదని, మన మేధస్సుకు మనమే 'ఎడిటర్ ఇన్ చీఫ్'గా వ్యవహరించాలని సూచించింది. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని, సమాధానాలను గుడ్డిగా నమ్మకుండా.. దానిని అర్థం చేసుకుని పుస్తకాలు, అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ధ్రువీకరించుకోవాలని తెలిపింది. అందులో విషయాన్ని లాజిక్‌గా పరిశీలించడం ఉత్తమ విద్యార్థి లక్ష్యమని వెల్లడించింది. విదేశీ విద్యార్థులతో పోలిస్తే.. భారత్ విద్యార్థులు ఏఐని నైపుణ్యాలు పెంచుకునేందుకు వినియోగిస్తున్నారని నివేదిక అభిప్రాయపడింది.

.... 2లో

---

## జూబ్లీహిల్స్ లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు



.... 3లో

---

## ఏఐ సమిట్‌లోనూ..
## కాంగ్రెస్ మురికి రాజకీయాలు

- కాంగ్రెస్ నాయకులు ప్రజల దృష్టిలో దిగజారారు
- ప్రపంచ దేశాల ఎదుట మన దేశాన్ని అవమానించారు
- దేశాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కాంగ్రెస్ తీరిక లేకుండా పనిచేస్తుంది ; ప్రధాని మోదీ

.... 3లో



---

## ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ..
## హైస్పీడ్ ఇంటర్నెట్

- టెక్నాలజీతో పౌర సేవలు సులభతరం
- అంతర్జాతీయ స్థాయి విజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరేలా చూడాలి
- ఏఐతో మరిన్ని ఉద్యోగాలు వచ్చేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం

.... 3లో



### మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు
# ఆశ్చర్యపోయాయి



స్థాయి నాణ్యతను దృష్టిలో పెట్టుకొని వస్తువుల ఉత్పత్తి, సేవలు ఉండాలని దేశంలోని తయారీదారులు, స్టార్టప్‌లకు సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రధాని మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

**––ఆ చిన్నారి నలుగురికి జీవనదాత**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తమ చిన్నారి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె తల్లిదండ్రులను ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దీనివల్ల ఆ చిన్నారి నలుగురికి జీవనదాతగా మారిందన్నారు. ఇటువంటి ఘటనల

### ఏఐ అతిగా వాడితే
# ప్రమాదమే!



ఇదే సరైన విధానమని పేర్కొంది. ఉన్నత విద్యలో విద్యార్థుల ఏఐ వినియోగంపై అనాటమీ ఆఫ్ వర్క్ సంస్థ 'ది షాడో కరిక్యులం' పేరిట అంతర్జాతీయంగా చేసిన అధ్యయన నివేదికను తాజాగా విడుదల చేసింది. విద్యార్థులు ఏఐ సహాయం లేకుండా విషయ విశ్లేషణ, సొంతగా రాయడం చేయాలి. మెదడు మొద్దుబారిపోకుండా ప్రాథమిక ఆలోచన సామర్థ్యానికి పదును పెట్టాలి. ఏఐ ఔట్‌పుట్‌లు పర్యవేక్షించి, ధ్రువీకరించి, మెరుగుపరుచుకుంటూ విద్యార్థులు సమగ్రంగా నేర్చుకునేలా ప్రస్తుత పాఠ్యప్రణాళికను అప్లైడ్ ఏఐ ఇంజినీరింగ్‌గా రీడిజైన్ చేయాలి'' అని నివేదిక పేర్కొంది.

**––ఏఐని వినియోగించేవారి కేటగిరీలు ఇలా..**

కేటగిరీ 1 ఆర్కిటెక్‌గా వ్యవహరించే విద్యార్థులు.. భారీ డేటాను విశ్లేషణ, ప్రాథమిక సమాచారానికి వినియోగిస్తారు. కానీ ప్రతి ఆలోచన సొంతగా చేస్తారు. ఏఐని శక్తిమంతమైనదిగా భావిస్తూ ఆ సబ్జెక్టుపై పూర్తి పట్టు సాధిస్తారు. కేటగిరీ 2 ఎసైన్‌మెంట్ల నుంచి ప్రతి పని చేసేందుకు ఏఐని వాడతారు. వీరు అతిగా ఆధారపడటం వల్ల ప్రమాదంలో పడిపోతారు. సొంత ఆలోచన శక్తి మందగిస్తుంది. కేటగిరీ 3 పుస్తకాలను నిమిషాల్లో చదవడం, వ్యాకరణ దోషాలు సరిచేసేందుకు ఏఐని వాడతారు. ఏఐని తీసివేస్తే ఒత్తిడిలో పడిపోయే ప్రమాదముంది. కేటగిరీ 4 తరగతిలో నేర్చుకున్న దానికి, మార్కెట్ అవసరాలకు మధ్య అంతరాన్ని ఏఐతో భర్తీ చేస్తుంటారు. కొత్త విషయాలు, కెరీర్ కోసం ఏఐని వినియోగిస్తారు. థియరీ కంటే ప్రాక్టికల్ నైపుణ్యాలను కీలకంగా చూస్తారు.

**––చీటింగ్ నిర్వచనం మారింది..**

ఏఐపై ఆధారపడటాన్ని 85శాతం మంది విద్యార్థులు తప్పుగా భావించడం లేదు. అయితే సొంత ఆలోచన లేకుండా ఎసైన్‌మెంట్‌ను ఏఐతో రాయించడాన్ని 32.3శాతం మంది చీటింగ్‌గా భావిస్తున్నారు. ఇది తప్పని తెలిసినా ఇతరుల కన్నా వేగంగా చేయాలన్న తపనతో ముందుకు వెళ్తున్నారు. ఏఐని నమ్ముకుని సొంతగా చదవకుంటే చివరకు ఏఐ అల్గారిథమ్‌పై ఆధారపడే ప్రమాదం వస్తుందని సర్వేలో వెల్లడైంది. ఏఐ రాసిన కంటెంట్‌ను ఎడిట్ చేసి, సాఫ్ట్‌వేర్‌లు గుర్తించకుండా జాగ్రత్త పడినా.. దాదాపు 30 శాతం మంది విద్యార్థులు ఏది తప్పో.. ఏది ఒప్పో తెలియని అయోమయ స్థితిలో వినియోగిస్తున్నారని పేర్కొంది.

**––భారత విద్యార్థులపై సర్వే ఇలా..**

భారత్‌లో విద్యార్థులు కళాశాలలు అనుమతి ఇచ్చే వరకు వేచి చూడకుండా ఇప్పటికే ఏఐని వాడుతున్నారు. పరిమిత స్థాయిలో విద్యా వనరులున్న విద్యార్థులకు సామాజిక ఎదుగుదల, ఇతరులతో సమానంగా పోటీపడే అవకాశం కల్పిస్తోంది. దేశంలో ఏఐని.. కాపీ కొట్టే టెక్నాలజీగా కాకుండా ప్రపంచస్థాయి ఉద్యోగ మార్కెట్‌లో పోటీ పడటానికి లభించిన అవకాశంగా చూస్తున్నారు.

విదేశాల్లో విద్యార్థులు వ్యాసాలు రాసేందుకు ఉపయోగిస్తే.. భారత్‌లో స్టెమ్ సబ్జెక్టుల్లో క్లిష్టమైన సమస్యలు అర్థం చేసుకునేందుకు వినియోగిస్తున్నారు.

### మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ
# లొంగుబాటు

**ఈ కబురు, హైదరాబాద్:** మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహారెడ్డి అలియాస్ గంగన్నతోపాటు సుమారు 20 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు సమాచారం. ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసుల ఎదుట వారు లొంగిపోయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. దేవ్‌జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీకి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

### ప్రాజెక్టులు పూర్తి చేసి
# రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం



ఇకనైనా ప్రాజెక్టులు పూర్తి చేసి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. మిగతా వాటిని పట్టించుకోలేదు. ఇప్పుడు మిగతా ప్రాజెక్టుల నిర్మాణానికి, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉంది. మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదు. కాళేశ్వరం నిరుపయోగమైనా.. అత్యధికంగా వరి దిగుబడి వస్తోంది. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారు, తీర్పు ఇచ్చారు. పదేళ్లు వాళ్లేం చేశారో, ఈ ప్రభుత్వం ఏం చేసిందో సభలో చర్చిద్దాం. పదేళ్ల అనుభవంతో వాళ్లు సూచనలు చేస్తే.. స్వీకరిస్తాం. జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తి అసంబద్ధం. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం. ప్రజలు, నీళ్ల విషయంలో కాదు. పలు ఎన్నికల్లో ప్రజల తీర్పు చూశాక కూడా బీఆర్‌ఎస్ నేతలు మారలేదు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి.. విజ్ఞతగా వ్యవహరించాలి. సీఎం కుర్చీ ప్రతీసారి వారసత్వంగా దక్కదు. తెదేపా, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున అవకాశం ఇచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులు గాలికి వదిలేయం. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తెస్తాం. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తాం. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

### జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
# ముగ్గురు ఉగ్రవాదుల హతం



ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే నిఘావర్గాల సమాచారం ఆధారంగా భద్రతాబలగాలు కిష్త్‌వాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలోనే చత్రూ బెల్ట్‌లోని పాసెర్‌కుట్ ప్రాంతంలోని ఓ గుడిసెలో ఉగ్రవాదుల ఆచూకీని గుర్తించాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. గుడిసెలో మంటలు చెలరేగడంతో మృతదేహాలు కాలిపోయాయి. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే47 రైఫిల్స్, ఇతర పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కరడుగట్టిన ఉగ్రవాది సైఫుల్లా దాదాపు ఐదేళ్ల క్రితం జమ్మూకశ్మీర్‌లోకి చొరబడినట్లు సమాచారం. అప్పటినుంచి స్థానికంగా యాక్టివ్‌గా ఉన్నాడు. 2024 జులైలో నలుగురు సైనికుల మృతికి కారణమైన దాడి సహా అనేక ఘటనలకు సూత్రధారి అనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనేక ఎన్‌కౌంటర్‌ల నుంచి తప్పించుకున్నాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడుగురు జైషేమహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు.

### ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?
# కేంద్రమంత్రి బండి సంజయ్



అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ''రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు ప్రారంభమయ్యాయి. ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి అరాచాకాలు సృష్టిస్తున్నాయి. భాజపా కార్యకర్తలారా.. వీటిని అడ్డుకునేందుకు సిద్ధంకండి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన సంఘటనలను గుర్తుంచుకోండి. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు చట్టాన్ని చేతుల్లో తీసుకోవడం దుర్మార్గం. కామారెడ్డిలో భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిపై దాడి అమానుషం. అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే. బాన్సువాడలో 70 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారు. రాళ్ల దాడి స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలేవీ? బాన్సువాడ వెళ్లేందుకు యత్నించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అన్యాయం. ఎంఐఎంను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది'' అని బండి సంజయ్ అన్నారు.

### బోడులో కీడు ఉందని..
# ఊరంతా ఖాళీ



పూజారులకు చూపిస్తే ఒకరోజు ఉదయం వేకువజామున ఊరంతా పిల్లాపాపలతో బయటకు వెళ్లి గడిపి సాయంత్రం సూర్యోదయం ముగిశాక ఇంటికి రావాలని సూచించారు. ప్రపంచం శరవేగంగా ఆధునికత వైపు పయనిస్తున్న తరుణంలో ఇంకా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బోడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పూజారుల సూచనలను బోడు గ్రామస్థులంతా ఉమ్మడిగా నిర్ణయం తీసుకుని ఆదివారం పాటించారు. ఊరి జనమంతా ఇళ్లకు తాళాలు వేసి పిల్లపాపలు, పెద్దలు, యువత, వృద్ధులంతా కలసి గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో సేద తీరారు. గ్రామం ఖాళీ కావడంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది .

### పేదల ఇళ్లు కూల్చి.. బడా బాబులకు భూములు కట్టబెట్టే కుట్ర:



సీఎం వేసే ప్రతి అడుగు వెనుకా భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉందన్నారు. ''పేదల ఇళ్లు కూల్చి బడాబాబులకు భూములు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. కేసీఆర్ మంచినీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే.. రేవంత్‌రెడ్డి బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నారు. డీపీఆర్ లేదు.. ఎఫ్‌టీఎల్ తేలలేదు.. అనుమతులు లేవు. ఏ చట్టం ప్రకారం ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తున్నారు? మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పేదల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం''అని హరీశ్‌రావు అన్నారు.

### కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క వదులుకోం
# ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని దేవాదుల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. 2027నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తామని.. 5 లక్షల పైచిలుకు ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. రెండేళ్లలో గోదావరి నది బేసిన్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. గోదావరి బేసిన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంటలు పండాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ 2026, జూన్ 2వరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# ఎవరూ అధైర్యపడొద్దు..




ఈ సందర్భంగా మూసీ బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదని మూసీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుతో వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. మూసీ డెవలప్‌మెంట్ చేసుకోండి కానీ.. మా ఇండ్లను మాత్రం లాక్కోకండని సూచించారు. రంగారెడ్డి జిల్లాలో భూములను కాంగ్రెస్ ప్రభుత్వం గుంజుకుంటుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మూసీ ప్రాజెక్టులో గాంధీ విగ్రహం అవసరమే లేదని తెలిపారు. ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని మండిపడ్డారు. ఒక్క ఇళ్లును కూడా టచ్ చేయకుండా రేవంత్ రెడ్డి అరాచకాన్ని మేం అడ్డుకుంటామని తెలిపారు. ఎవరూ అధైర్య పడొద్దని.. బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఒక్క ఇళ్లును కూడా టచ్ చేయకుండా మూసీ డెవలప్‌మెంట్ చేయాలని కేసీఆర్ సూచించారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మూసీ బాధితుల ఆవేదన చాలా బాధగా అనిపిస్తోందని అన్నారు. మూసీ అని చెప్పి ప్రజల ఇల్లు కూల్చడం సరికాదని హితవు పలికారు.

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు
# రామచందర్‌రావు అరెస్ట్



ఆదివారం ఉదయం తార్నాకలోని రామచంద్ర రావు ఇంటిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు ఆయనను అరెస్టు చేసి ఖరఖానా పోలీస్ స్టేషన్ కు తరలించారు .ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న దమనకాండ, అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ రామచంద్ర రావు మీడియాతో మాట్లాడారు . బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయంపై దాడి, అక్రమ అరెస్టులు, హౌస్ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధకాండ బయటపడింది. బాన్సువాడలో మా పార్టీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. మా ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. ఆ ఆరోపణలను నిరూపించమని ప్రశ్నిస్తే, చర్చకు సిద్ధంగా లేక దాడులకు దిగడం కాంగ్రెస్ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శన మని దుయ్యబట్టారు. ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులను "నిరూపించండి" అని అడిగినందుకే దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య. ఇది చట్టాన్ని, న్యాయాన్ని, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే వ్యవహారం. ఈ ఘటనలో తిరిగి బీజేపీ కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకుని సుమారు 70 మందిని అక్రమంగా, అన్యాయంగా అరెస్ట్ చేశారు. దాడి చేసినవారిని వదిలేసి, బాధితులైన బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పక్షపాత వైఖరిని స్పష్టంగా చూపిస్తోందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యాలయంపై దాడి చేసింది కాంగ్రెస్ నాయకులే. ఆ తర్వాత తిరిగి వెళ్తున్న సమయంలో పబ్లిక్‌లో కాంగ్రెస్ నాయకులకు చెందినదని చెబుతున్న కారును కాంగ్రెస్ నేతలే ధ్వంసం చేసి, ఆ నేరాన్ని బీజేపీ నేతలపై మోపే ప్రయత్నం చేశారు. కామారెడ్డికి వెళ్లకుండా నన్ను, ఇతర బీజేపీ రాష్ట్ర నాయకులను ముందస్తు హౌస్ అరెస్టులు చేయడం, గృహ నిర్బంధాలకు పాల్పడడం తీవ్ర అన్యాయం. ఈ అక్రమ చర్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిన్న మా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ని, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ని దారిలోనే పోలీసులు అరెస్ట్ చేయడం మరో దుర్మార్గ చర్య. ఈ పరిణామాలపై పోలీసు అధికారులతో మేం మాట్లాడాం. బాన్సువాడలో ఉద్రిక్తతల నేపథ్యంలో మా ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపేందుకు మేం వెళ్లాలనుకుంటే అడ్డుకుంటున్నారు. ఇవాళ మా పార్టీ ముఖ్య నాయకులతో కలిసి బాన్సువాడకు వెళ్లాలని మేము స్పష్టంగా నిర్ణయించుకున్నాం. నాతో పాటు పలువురు ముఖ్య నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించి, ముందస్తు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. మేము బాన్సువాడకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం. మా కార్యకర్తలు మా కోసంఎదురుచూస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాన్సువాడకు వెళ్లి తీరుతాం. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, మా ప్రజాస్వామ్య పోరాటం ఆగదని హెచ్చరించారు.

# దేశంలో దాడులకు ప్రణాళికలు.. ఉగ్రముఠా అరెస్టు



పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ISI)తో పాటు, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థలతో వీరికి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అరెస్టు అయిన ఆరుగురిలో బంగ్లాదేశ్‌కు చెందిన వారు ఉన్నారని.. వారు నకిలీ ఆధార్ కార్డులను వాడుతున్నట్లు గుర్తించామన్నారు. పలు ఉగ్ర సంస్థల హ్యాండ్లర్లతో వీరు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. అనుమానితులను మిజానూర్ రెహమాన్, మహమ్మద్ షబాత్, ఉమర్, మహమ్మద్ లిటాన్, మహమ్మద్ షాహిద్ మొహమ్మద్ ఉజ్జల్‌లుగా గుర్తించామన్నారు. మరోవైపు ఉగ్రవాదులతో సంబంధం ఉన్న ఇద్దరు అనుమానితులను బెంగాల్లో అరెస్ట్ చేశారు. విదేశీ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరు దేశంలో భారీ స్థాయిలో ఉగ్రదాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. వారి నుంచి 8 ఫోన్లు, 16 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫోన్‌లలోని డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టామన్నారు. ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టే విధంగా ఢిల్లీలోని బహిరంగ ప్రదేశాల్లో అతికించిన పోస్టర్ల ఆధారంగా దర్యాప్తు చేస్తున్న క్రమంలో వీరిని గుర్తించామన్నారు. ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

## ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ..
# హైస్పీడ్ ఇంటర్నెట్

- ఇన్నోవేషన్లకు ఏపీ టెస్ట్ బెడ్
- గత ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను నాశనం చేసింది
- రూరల్ డిజిటల్ కనెక్టివిటీపై జరిగిన MoC కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక సహకార ఒప్పందం
- 5 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు ఇచ్చే లక్ష్యంతో ఏపీలో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్
- సీఎం చంద్రబాబు-కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో MoC



**ఈ కబురు, అమరావతి:**

ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలంటే ప్రతి ఇంటికీ డిజిటల్ కనెక్టివిటీ ముఖ్యమని సీఎం వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం కుదిరింది. సుమారు 5 లక్షల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్‌ఏబీఎన్‌పీ అమలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏపీలో ఏబీఎన్‌పీ అమలుకు రూ.2,432 కోట్ల మేర నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఏబీఎన్‌పీ కోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (APBIL) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం SPV ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధిరాష్ట్ర ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నిధులు సమకూర్చి ప్రాజెక్టు అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో డిజిటల్ భారత్ నిధిఏపీ ప్రభుత్వం మధ్య MoC కుదుర్చుకున్నారు. డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐ అండ్ ఐ శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు MoCపై సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్ఫ్రా బలోపేతం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేలా సహకార ఒప్పందం చేసుకున్నారు. త్వరితగతిన అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్ర స్థాయి సమన్వయానికి పూర్తి సహకారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. 1,692 ఫేజ్I పంచాయతీల్లోని నెట్ వర్క్ అప్ గ్రేడ్ చేయడం, 11,254 ఫేజ్IIలోని గ్రామాల డిజిటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం... ఇక కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం వంటి వాటిపై ఈ ఏబీఎన్‌పీ ప్రాజెక్టుతో పని చేయనుంది. 3,942 గ్రామాల్లో డిమాండ్ ఆధారంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచే అంశంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డిజిటల్ కనెక్టివిటీ ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈగవర్నెన్స్ వంటి సేవలను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఈ సహకార ఒప్పందం కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు బాండ్ విడ్త్ పెంచమని బీఎస్ఎన్ఎల్‌ను అడిగాను. పెంచిన బ్యాండ్ విడ్త్‌తో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్సులు పెట్టేవాడిని. టెలికాం రంగంలో సంస్కరణలు తీసుకురావాలని నాటి ప్రధాని వాజ్ పేయిని కోరాను. అప్పట్లో జాతీయ స్థాయిలో కమిటీ వేస్తే టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టాలని నివేదిక ఇచ్చాం. ఆ తర్వాత దేశవ్యాప్తంగా డిరెగ్యులేషన్ అమల్లోకి వచ్చింది. భారతదేశంలో డిజిటల్ విప్లవానికి, డిజిటల్ కనెక్టివిటీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చక్కగా పని చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**చక్కటి వ్యవస్థను నాశనం చేశారు...**

"201419 మధ్య కాలంలో ఫైబర్ నెట్ వ్యవస్థను ఏర్పాటు చేశాం... కరెంట్ పోల్స్‌పై ఫైబర్ కేబుల్స్ వేసి కనెక్టివిటీ కల్పించాం. 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ఆ తర్వాత 2019లో వచ్చిన ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టింది. గత ప్రభుత్వం దురుద్దేశ్యంతో చేసిన నిర్వాకం వల్ల కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది.. ఇప్పుడు మళ్లీ కేంద్ర సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని పెంచుతాం. వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయడానికి ఈ చర్యలు ఉపకరిస్తాయి. ఏఐక్వాంటం టెక్నాలజీలకు ప్రధాని చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారు.. అందుకే ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు నిర్వహించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు వివిధ దేశాల నుంచి దిగ్గజ కంపెనీలకు చెందిన ప్రముఖులు వచ్చారు. గ్లోబల్ నాలెడ్జిని గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి...దానికి కేంద్రం సహకరిస్తోంది. డిజిటల్ కనెక్టివిటీ ఉంటే ప్రజలకు సేవలు కూడా చాలా సులువుగా అందుతాయి. వాట్సాప్ ద్వారా 900కు పైగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీతో పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి భద్రత కల్పిస్తున్నాం. భూ రికార్డులకు బ్లాక్ చైన్ టెక్నాలజీతో సెక్యూర్టీ కల్పిస్తున్నాం. టెక్నాలజీని అనుసంధానించి ప్రజారోగ్య రంగంలో సంజీవని ప్రాజెక్టు అమలు చేయబోతున్నాం. ఏఐ సహకారంతో విద్య, వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. వివిధ ఏఐ అప్లికేషన్లను అందుబాటులోకి తెస్తాం. ఏఐతో ఉద్యోగాలు పోవడం కాదు.. ఉద్యోగాలు క్రియేట్ అయ్యేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం" అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**నెంబర్-1 స్థానం దక్కించుకునే సత్తా బీఎస్ఎన్ఎల్‌ది**

"టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో... ఇతర దేశాల కంటే భారతదేశం చాలా ముందుంది. భారతదేశంలో బ్రాండ్ న్యూ టెక్నాలజీ అందుబాటులో ఉంది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నేతృత్వంలో బీఎస్ఎన్ఎల్ నెంబర్ 1 నెట్ వర్క్ అవుతుందనే నమ్మకం ఉంది. బీఎస్ఎన్ఎల్ సంస్థకు ఆ కెపాసిటీ ఉంది. గూగుల్ డేటా సెంటర్ ఏపీకి రాబోతోంది... విశాఖ నుంచి ఇతర దేశాలకు సబ్ సీ కేబుళ్ల ద్వారా డేటాను పంపే పరిస్థితి వస్తుంది. ఏపీలో 5 లక్షల మంది వర్క్ ఫ్రం హోం ద్వారా పని చేస్తున్నారు. పారిశ్రామిక విప్లవాన్ని భారత దేశం అందుకోలేకపోయింది.. సర్వీస్ రంగాన్ని అందుకున్నాం... అభివృద్ధి చెందుతున్నాం. ఏపీలో చాలా ప్రముఖ సంస్థలు, జీసీసీలు వస్తున్నాయి. వన్ ఫ్యామిలీవన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ఐబీఎం టీసీఎస్ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ తెస్తున్నాం. వచ్చే రెండు మూడేళ్లలో క్వాంటం కంప్యూటర్లను అమరావతి నుంచి ఉత్పత్తి చేయాలని ఆలోచన చేస్తున్నాం. బ్యూరోక్రసీ కూడా ఏఐలో నైపుణ్యం పెంచుకోవాలి. టెలికాం, టెక్నాలజీ రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా... టెస్ట్ బెడ్‌గా ఉండేందుకు ఏపీ సిద్ధం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏఐ సమిట్‌లోనూ..
# కాంగ్రెస్ మురికి రాజకీయాలు





ఈ కబురు, మేరఠ్: ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గ్లోబల్ ఈవెంట్ ఏఐ సమిట్ ను కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా మార్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. యూపీలోని మేరఠ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏఐ సమిట్‌లో విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్నంగా వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రజల దృష్టిలో దిగజారారని.. ఇంకా ఇటువంటి పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే పనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈవిధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ప్రధాని విమర్శించారు. రాజకీయ విభేదాల కంటే వారు వ్యక్తిగత శత్రుత్వంపైనే దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో తనను, తన తల్లిని అవమానించారని..ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం దేశపరువు తీయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.

**——అసలేం జరిగింది..?**

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎగ్జిబిషన్ హాలు నంబరు 5లోకి ప్రవేశించిన దాదాపు 15 మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీషర్ట్‌లు వారి చేతుల్లో కనిపించాయి. వారి చర్యల వల్ల కొంత సమయం పాటు సమావేశానికి అంతరాయం కలిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వారిని

## జూబ్లీహిల్స్‌లో బీభత్సం
# సృష్టించిన స్పోర్ట్స్ కారు



**ఈ కబురు, హైదరాబాద్**

- జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పిన ఫెరారీ స్పోర్ట్స్ కారు
- అతివేగంతో ఇతర వాహనాలను ఢీకొట్టి బీభత్సం
- ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- రోడ్ నెం. 45లో భారీగా నిలిచిన ట్రాఫిక్
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్న పోలీసుల సూచన

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో ప్రయాణిస్తున్న ఈ కారు రోడ్ నెం. 45లో అదుపుతప్పి పక్క రోడ్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో పలు కార్లు, బైక్‌లను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నివాసానికి సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి వాహనాలు నుజ్జునుజ్జవగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం. 45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అలాగే కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం. 45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొమురం భీమ్ జిల్లా జైనూర్ లో భారీ వర్షం



**ఈ కబురు; తెలంగాణలో వాతావరణ ఒక్కసారిగా మారిపోయింది. ఏపీ,తెలంగాణలోని పలు చోట్ల వర్షా లు పడుతున్నాయి. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈదురుగాలులు వీస్తుండగా.. కొమురం భీమ్ జిల్లా జైనూర్ లో భారీ వర్షం పడింది. ఫిబ్రవరి 22న సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షా నికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు.**

**మూడు రోజులు రెయిన్ అలర్ట్**

మరోవైపు తెలంగాణకు మరో మూడు రోజుల పాటు రెయిన్ అలర్ట్ జారీ చేసింది రాష్ట్ర వాతావరణ శాఖ. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల మోస్తారు వర్షాలు పడతాయని వెల్లడించింది. ఉత్తర తెలంగాణ, భద్రాద్రి జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. మూడు రోజుల తర్వాత మళ్లీ టెంపరేచర్లు పెరుతాయంది. ప్రస్తుతం మధ్యాహ్నం 32 నుంచి 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వెల్లడించింది.

# కేసీఆర్ ఆరోగ్యం కాపాడుకోండి
## సీఎం రేవంత్ రెడ్డి



**మార్నింగ్ వాకింగ్..ఈవినింగ్ వ్యాయామం చేయండి: సీఎం రేవంత్ రెడ్డి**

ఈ కబురు ; తెలంగాణలో 2034 వరకు ప్రజలు కాంగ్రెస్ నే ఆదరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఆరోగ్యం కాపాడుకోవాలన్న సీఎం రేవంత్..ఆయన ఆరోగ్యంపై పలు సలహాలు ఇచ్చారు. కేసీఆర్ ఉదయం వాకింగ్..సాయంత్రం వ్యాయామం చేయాలని సూచించారు. పిల్లిశాపనార్థాలతో ఉట్టి తెగదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇంకో పదేండ్లు ఆరోగ్యంగా ఉండాలి.. అందుకు పుస్తకాలు చదవాలి, ప్రవచనాలు వినాలని చెప్పారు. ఎంపీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు ప్రజల తీర్పు చూసైనా బీఆర్ఎస్ తీరు మారడం లేదన్నారు. కేసీఆర్,హరీశ్ రావు అసెంబ్లీకి వస్తే నది జలాలపై చర్చిద్దామన్నారు రేవంత్. చౌకబారు ఆరోపణలతో తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీయొద్దని సూచించారు. పదేండ్లు అనుభవం ఉన్న కేసీఆర్, హరీశ్ సలహాలు, సూచనలు ఇస్తే పాటిస్తామన్నారు. తెలంగాణలో గెలిచి ఏపీకి ఎందుకు సహకరిస్తామని ప్రశ్నించారు. గోదావరిలో నీటి హక్కులను కాపాడుతామని..ఎవరూ టెన్షన్ పడొద్దని సూచించారు రేవంత్. సాగునీటి ప్రాజెక్టులు 70 శాతం పూర్తయినా నిధులు లేక ఆగాయన్నారు. చ్చే రెండేండ్లలో తుమ్మిడి హెట్టి నుంచి భద్రాచలం గోదావరి పరివాహక ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు రేవంత్.

## సుప్రీం తీర్పు ఎఫెక్ట్..
# భారత్‌అమెరికా చర్చలు రీషెడ్యూల్!

ఈ కబురు : భారత్‌అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు సోమవారం జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డట్లు సమాచారం. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ఫిబ్రవరి 23 నుంచి 3 రోజుల పాటు వాషింగ్టన్‌లో ఇరుదేశాల ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉంది. కాగా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలోనే ఈ చర్చలను రీషెడ్యూల్ చేసినట్లు తెలుస్తోంది. ఇరు దేశాలకు అనుకూలమైన తేదీలలో ఈ చర్చలను తిరిగి నిర్వహించనున్నట్లు విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ప్రకటనను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. టారిఫ్‌లు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా వాటిని 15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. మున్ముందూ చట్టబద్ధమైన టారిఫ్‌లను జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యంతో భారత్ చేసుకొన్న ట్రేడ్ డీల్ లో మార్పులు జరిగే అవకాశం ఉంది.



# అత్యంత వేగవంతమైన మెట్రోను ప్రారంభించిన మోదీ



మేరఠ్ మెట్రోతో పాటు ఢిల్లీమేరఠ్‌ల మధ్య నడిచే హైస్పీడ్ 'నమో భారత్' రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం మేరఠ్ సౌత్ స్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు.ఈ సందర్భంగా దాదాపు రూ.12,930 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ.. కాంగ్రెస్ హయాంలో కేవలం ఐదు నగరాల్లోనే మెట్రో సేవలు ఉండగా, తమ ప్రభుత్వ హయాంలో 25 నగరాలకు ఈ సేవలు విస్తరించాయన్నారు. దీంతో ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. ఢిల్లీమేరఠ్‌ల మధ్య 82 కి.మీ మేర నమో భారత్ కారిడార్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్‌న్యూ అశోక్ నగర్‌ల మధ్య ఐదు కి.మీ, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్ సౌత్‌మోదీపురం మధ్య 21 కి.మీ సెక్షన్‌లను అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఢిల్లీమేరఠ్‌ల మధ్య ఆర్ఆర్‌టీఎస్ మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. 'నమో భారత్' రైళ్లు నడిచే సెమీ హైస్పీడ్ మార్గంలోనే మేరఠ్ సౌత్‌మోదీపురం మధ్య మెట్రో రైలును ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. దేశంలో ఈ తరహా చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి. ఇక్కడ నడిచే మెట్రో రైలు గరిష్ఠ వేగం గంటకు 120 కి.మీ. సమీకృత పట్టణాల మధ్య వేగవంతమైన ప్రయాణం కోసం నమో భారత్ రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(RRTS)ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సాహిబాబాద్, గాజియాబాద్, మోదీనగర్ నుంచి దేశ రాజధానికి వేగంగా చేరుకునేలా ఈ రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. వీటి మధ్య నడిచే సెమీ హైస్పీడ్ రైళ్లు గరిష్ఠంగా గంటకు 180 కి.మీ వేగంతో నడిచేలా రూపొందించారు. ప్రస్తుతం సగటున 90 కి.మీ వేగంతో రైళ్లను నడిపిస్తున్నారు.

## ఫారెక్స్ ఆల్‌టైమ్ హై..
## బంగారం 128.46 బిలియన్ డాలర్లు



ముంబై: విదేశీ మారకం నిల్వలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకున్నాయి. ఫిబ్రవరి 13తో ముగిసిన వారంలో 8.66 బిలియన్ డాలర్ల మేర పెరిగి 725.72 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆర్‌బీఐ వెల్లడించింది. అంతకు ముందు ఫిబ్రవరి 6తో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 6.71 బిలియన్ డాలర్ల మేర తగ్గి 717.06 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో నమోదైన 723.77 బిలియన్ డాలర్లు పూర్వపు గరిష్ట స్థాయిగా ఉంది.

ఫిబ్రవరి 13తో ముగిసిన వారంలో కరెన్సీ ఆస్తులు (విదేశీ మారకం నిల్వల్లో అధిక భాగం) నికరంగా 3.55 బిలియన్ డాలర్లు పెరిగి 573.60 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్లతోపాటు, యూరో, పౌండ్, యెన్ రూపంలో విదేశీ కరెన్సీ ఆస్తులున్నాయి.

బంగారం రూపంలో మారకం నిల్వలు 4.99 బిలియన్ డాలర్ల మేర పెరిగి 128.46 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) 103 మిలియన్ డాలర్లు పెరిగి 18.92 బిలియన్ డాలర్లకు చేరాయి.

## ప్రైవేటు బ్యాంకులో రూ .590 కోట్ల ఫ్రాడ్..




**ప్రముఖ ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో (IDFC First Bank) రూ. 590 కోట్ల ఫ్రాడ్ వెలుగులోకి వచ్చింది. చండీగఢ్‌లోని ఒక బ్రాంచ్‌లో హర్యానా ప్రభుత్వ ఖాతాలకు సంబంధించి అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు బ్యాంక్ వెల్లడించింది.**

బ్యాంక్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. హర్యానా ప్రభుత్వంలోని ఒక నిర్దిష్ట విభాగం నుంచి సమాచారం అందిన అనంతరం ప్రాథమిక అంతర్గత విచారణ చేపట్టగా ఈ అక్రమాలు బయటపడ్డాయి. చండీగఢ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు అనధికారిక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఈ వ్యవహారంలో ఇతర వ్యక్తులు, సంస్థలు లేదా కౌంటర్ పార్టీల ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటివరకు గుర్తించిన ఖాతాల్లో మొత్తం రూ. 590 కోట్ల మేర ప్రభావం ఉన్నట్లు అంచనా వేసిన బ్యాంక్.. పూర్తి వివరాలు, క్లెయిమ్‌ల ధ్రువీకరణ అనంతరం తుది ప్రభావాన్ని వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఈ ఘటన చండీగఢ్ బ్రాంచ్ ద్వారా నిర్వహించబడుతున్న హర్యానా ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని ప్రభుత్వలింక్డ్ ఖాతాలకు మాత్రమే పరిమితమైందని ప్రాథమిక విచారణలో తేలినట్లు పేర్కొంది. ఇతర ఖాతాదారులపై ప్రభావం లేదని బ్యాంక్ వెల్లడించింది.

హర్యానా ప్రభుత్వంలో ఓ విభాగం తన ఖాతాను మూసివేసి నిధులను మరొక బ్యాంకుకు బదిలీ చేయాలంటూ చేసిన అభ్యర్థనతో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ప్రక్రియలో ఖాతా బ్యాలెన్స్‌తో పోలిస్తే గణనీయమైన వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మరికొన్ని ప్రభుత్వ విభాగాలు కూడా తమ ఖాతాల వివరాలపై బ్యాంకును సంప్రదించగా, బ్యాంక్ రికార్డులు, రాష్ట్ర ప్రభుత్వ లెక్కల మధ్య పలు తేడాలు ఉన్నట్లు తెలిసింది. దర్యాప్తు పూర్తయ్యే వరకు నలుగురు అనుమానిత అధికారులను సస్పెండ్ చేసినట్లు బ్యాంక్ వెల్లడించింది. వర్తించే చట్టాల ప్రకారం సంబంధిత ఉద్యోగులు, ఇతర బయటి వ్యక్తులపై కఠినమైన క్రమశిక్షణా, సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈ ఘటనను మోసాల కేసుల పర్యవేక్షణ, అనుసరణ బోర్డు (SCBMF) ప్రత్యేక కమిటీ ముందుంచినట్లు పేర్కొన్న బ్యాంక్.. స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు బాహ్య ఏజెన్సీని నియమించే ప్రక్రియలో ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించగా, పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## దేశీయంగా చిప్‌ల తయారీ ముఖ్యం



గ్రేటర్ నోయిడా: అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే దేశీయంగా చిప్‌లు తయారు చేయడం చాలా ముఖ్యమని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వెల్లడించారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్‌ల సంయుక్త సంస్థ (జేవీ) అయిన ఇండియా చిప్ ప్రైవేట్ లిమిటెడ్ శంకుస్థాపనకు దృశ్య మాధ్యమ విధానంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొవిడ్19 మహమ్మారి సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధిని నిలిపివేసిందని, వివిధ ప్లాంట్లలో పనులు నిలిచిపోయాయని తెలిపారు. 'మన దేశం స్వయం సమృద్ధిగా ఉన్నప్పుడే అభివృద్ధి చెందిన దేశంగా నిర్మితమవుతుంది. దీని కోసం మేడిన్ ఇండియా చిప్ చాలా ముఖ్యం. మన దేశం సాంకేతిక రంగంలో ఏం చేసినా, అది 21వ శతాబ్దంలో మన సామర్థ్యానికి పునాది అవుతుంద'ని మోదీ వెల్లడించారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ జేవీ ఓశాట్ (ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) ప్లాంట్ గ్రేటర్ నోయిడాలోని జెవార్ దగ్గరున్న యమునా ఎక్స్‌ప్రెస్‌వే పారిశ్రామిక అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (వైఈఐడీఏ) వద్ద రాబోతోంది. ఇండియా చిప్ ప్రై.లి.లో హెచ్‌సీఎల్ గ్రూప్‌నకు 60 శాతం, ఫాక్స్‌కాన్‌కు 40 శాతం వాటా ఉంది. ఈ సంస్థ వచ్చే కొన్నేళ్లలో రూ.3,700 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టబోతోంది. 2028 నాటికి కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ప్లాంటులో డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌లు తయారవుతాయి. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,500 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# డిజిటల్ విప్లవం: క్యాష్‌కు చెక్.. యూపీఐదే హవా!

- రూపే డెబిట్ కార్డ్, యూపీఐ
- లావాదేవీలపై తాజా సామాజిక–ఆర్థిక ప్రభావ నివేదిక
- గత ఎనిమిదేళ్లలో ఏకంగా 11 రెట్లు పెరిగిన డిజిటల్ లావాదేవీలు
- బ్యాంకులకు, ఏటీఎంలకు వెళ్లే వారి సంఖ్య భారీగా క్షీణత
- ఆన్‌లైన్ చెల్లింపులతో పెరిగిన చిరు వ్యాపారుల అమ్మకాలు
- భారత జీడీపీకి 16.2 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక ఊతం




దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవం సామాన్యుడి జీవనశైలిని సమూలంగా మార్చేసింది. చిల్లర కష్టాలకు చెక్ పెడుతూ.. గల్లీ లోని కిరాణా షాపు నుంచి మల్టీప్లెక్స్‌ల వరకు ఎక్కడ చూసినా ఇప్పుడు 'స్కాన్ అండ్ పే' మంత్రమే మార్మోగుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, రూపే డెబిట్ కార్డులు, తక్కువ-విలువ కలిగిన భీమ్-యూపీఐ లావాదేవీల వల్ల దేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ మేరకు ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) సంయుక్తంగా విడుదల చేసిన 'సామాజిక-ఆర్థిక ప్రభావ విశ్లేషణ' నివేదికలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. ఈ అధ్యయనాన్ని ఇప్సోస్ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించింది. యూపీఐ సంచలనం.. రికార్డుల మోత గత ఎనిమిదేళ్ల వ్యవధిలో దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏకంగా 11 రెట్లు పెరిగాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 2,071 కోట్లుగా ఉన్న ఆన్‌లైన్ లావాదేవీల సంఖ్య 2024-25 నాటికి 22,831 కోట్లకు చేరింది. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో ఒకప్పుడు కేవలం 4 శాతంగా ఉన్న యూపీఐ వాటా.. ఇప్పుడు ఏకంగా 80 శాతానికి చేరుకుని అగ్రగామిగా నిలిచింది. పీర్-టు-మర్చంట్ అంటే వినియోగదారులు వ్యాపారులకు చేసే చెల్లింపుల్లో 26 రెట్ల భారీ వృద్ధి నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే రియల్-టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 49% వాటాతో మన దేశం గ్లోబల్ లీడర్‌గా కొనసాగుతోంది.

### తగ్గుముఖం పట్టిన ఏటీఎం క్యూలు

దేశంలో యూపీఐ వాడకం విపరీతంగా పెరగడంతో జేబులో నగదు పెట్టుకుని తిరిగే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. నివేదిక ప్రకారం.. 59% మంది వినియోగదారులు, 57% మంది వ్యాపారులు తమ దైనందిన జీవితంలో నగదు వాడకం బాగా తగ్గిపోయిందని స్పష్టం చేశారు. నగదు డ్రా చేసేందుకు బ్యాంకులకు వెళ్లే వినియోగదారుల సంఖ్య 69% మేర తగ్గిపోగా, ఏటీఎంల నుంచి డబ్బులు డ్రా చేయడం 62% మేర పడిపోయింది. వ్యాపారుల్లో ఏటీఎం విత్‌డ్రాలు 61% మేర తగ్గాయి.

### జీడీపీకి భారీ ఆర్థిక ఊతం

నగదు నిర్వహణ ఖర్చులు తగ్గడం, డిజిటల్ లావాదేవీల్లో పారదర్శకత పెరగడం ద్వారా యూపీఐ ఏకంగా భారత జీడీపీకి (2022 సంవత్సరంలో) అదనంగా 16.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.3 లక్షల కోట్లు) జోడింపును అందించినట్లు ఈ నివేదిక వెల్లడించింది. లావాదేవీలపై అదనపు రుసుములు లేకపోవడం దీనికి ప్రధాన కారణంగా నిలిచింది.

### మారుమూల ప్రాంతాల్లోనూ మారుమోగుతున్న 'స్కాన్ అండ్ పే'

డిజిటల్ చెల్లింపుల మద్దతు కేవలం మహానగరాలకే పరిమితం కాలేదు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, మారుమూల ప్రాంతాల్లోనూ యూపీఐ క్యూఆర్ కోడ్‌లు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. వృద్ధి రేటును గమనిస్తే.. లక్షద్వీప్‌లో ఏకంగా 136%, మేఘాలయలో 83%, జమ్మూకాశ్మీర్‌లో 76% మేర యూపీఐ లావాదేవీల వృద్ధి నమోదైంది.

### వినియోగదారులు ఏమనుకుంటున్నారు?

చాలా సులభంగా వాడుకునే వీలుండటం (63%), తక్షణమే ఇతరుల ఖాతాల్లోకి నగదు బదిలీ జరగడం (59%) వల్లే యూపీఐను ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు వినియోగదారులు సర్వేలో తెలిపారు. క్యాష్‌బ్యాక్ ఆఫర్లు (52%), మెరుగైన ఇంటర్నెట్ సౌకర్యం (37%), మెరుగైన భద్రతా ఫీచర్లు (36%) లాంటివి డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాయి. మరింత మందికి చేరువయ్యేందుకు స్థానిక భాషల్లో యాప్స్ అందుబాటులో ఉండాలని 21% మంది అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు నగదు కోసం ఏటీఎంలు, బ్యాంకుల చుట్టూ తిరిగిన సగటు భారతీయుడు.. ఇప్పుడు తన స్మార్ట్‌ఫోన్‌నే బ్యాంక్‌గా మార్చుకుని పారదర్శకమైన ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నాడని ఈ అధ్యయనం తేల్చిచెప్పింది.

## వివో నుంచి ప్రీమియం ఫోన్లు...
# 'జీస్' ట్రిపుల్ కెమెరాతో..



న్యూఢిల్లీ: వివో ఇండియా తన 'వీ' సిరీస్ నుంచి 'వివో వీ70', 'వివో వీ70 ఎలైట్' పేర్లతో రెండు ప్రీమియం స్మార్ట్ ఫోన్లను భారతీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఫోటోగ్రఫీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే 'వివో' ఈసారి కెమెరాలకు ప్రసిద్ధి చెందిన 'జీస్' సంస్థతో ప్రత్యేక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. రెండు ఫోన్లలోనూ జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది.

50 మెగా పిక్సెల్ (ఎంపీ) ప్రైమరీ కెమెరా, 50 ఎంపీ టెలి ఫొటోలెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ఉత్తమ సెల్ఫీల కోసం ముందు భాగంలో 50 ఎంపీ జీస్ ఫ్రంట్ కెమెరా ఉంది. అల్యూమినియం ఫ్రేమ్, రౌండెడ్ కార్నర్లతో ప్రీమియం లుక్ ఇచ్చారు. వీటికి ఐపీ68, ఐపీ69 రేటింగ్ ఉండడంతో నీరు, దుమ్ము, ధూళి నుంచి రక్షణ లభిస్తుంది. 6.59 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటుకు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తాయి.

ఈ రెండూ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజన్ ఓఎస్6తో పనిచేస్తాయి. వీటికి ఆరేళ్ల సాఫ్ట్‌వేర్ సపోర్ట్ ప్రకటించింది. రెండు ఫోన్లలో భారీ 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 90డబ్ల్యూ ఫ్లాష్‌ఛార్జ్‌కి సపోర్ట్ చేస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 40 గంటల వీడియో ప్లేబ్యాక్ లేదా 11 గంటల నావిగేషన్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది. హీట్ తగ్గించడానికి 'బైపాస్ ఛార్జింగ్' సౌకర్యం కూడా ఉంది.

**వివో వీ70**

ఇందులో స్నాప్‌డ్రాగన్ 7 జెన్4 ప్రాసెసర్‌ను అందించారు. రోజువారీ పనులు, గేమింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.45,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ+ 256జీబీ వేరియంట్ రూ.49,999కు లభిస్తుంది

**వివో వీ70 ఎలైట్**

ఇందులో శక్తివంతమైన క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్‌జెన్3 చిప్‌సెట్‌తో వస్తుంది. ఇది గేమింగ్, అధిక పనితీరుకు అనువుగా ఉంటుంది. మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధరను రూ.51,999గా కంపెనీ పేర్కొంది. 12జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.56,999, 12జీబీ+ 512 జీబీ వేరియంట్ ధర రూ.61,999గా నిర్ణయించింది.

ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్ కార్డులపై 10% వరకు డిస్కౌంట్ అందిస్తోంది. రూ.1,499 వివో ఇయర్ బడ్స్ ను ఉచితంగా పొందవచ్చు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వివో ఆన్‌లైన్ స్టోర్లలో లభిస్తున్నాయి.

## 900 పైగా ల్యాండ్ క్రూయిజర్లు రీకాల్..




టొయోటా కిర్లోస్కర్ మోటర్ సంస్థ తన ప్రముఖ లగ్జరీ ఎస్‌యూవీ టొయోటా ల్యాండ్ క్రూయిజర్ 300 (Toyota Land Cruiser 300)కు సంబంధించి 969 యూనిట్లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. 2024 సెప్టెంబర్ 4 నుంచి 2025 సెప్టెంబర్ 30 మధ్య తయారైన వాహనాలు ఈ రీకాల్ పరిధిలోకి వస్తాయి.

**ట్రాన్స్‌మిషన్ సాఫ్ట్‌వేర్ లోపమే కారణం**

కంపెనీ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం.. ట్రాన్స్‌మిషన్ పనితీరును నియంత్రించే ట్రాన్స్‌మిషన్ కంట్రోల్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో సంభావ్య లోపం గుర్తించారు. ట్రాన్స్‌మిషన్‌లో గేర్ మార్పులను నిర్వహించేందుకు లీనియర్ సోలెనాయిడ్లు ఉపయోగిస్తారు. కొన్ని నిర్దిష్ట డ్రైవింగ్ పరిస్థితుల్లో ఈ సోలెనాయిడ్ సరిగా పనిచేయకపోతే, సాఫ్ట్‌వేర్ లోపం వల్ల ట్రాన్స్‌మిషన్ కంట్రోల్ యూనిట్, ఇంజిన్ ఈసీయూ మధ్య కమ్యూనికేషన్ లోపం ఏర్పడే అవకాశం ఉంది.

ఈ లోపం సరిచేయకపోతే కొన్ని గేర్లలో ట్రాన్స్‌మిషన్ ఓవర్‌రివింగ్‌కు దారితీసే ప్రమాదం ఉంది. దీర్ఘకాలంలో ఇది ట్రాన్స్‌మిషన్‌కు నష్టం కలిగించడమే కాకుండా, అధిక వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు పవర్ లాస్ సమస్యను కూడా కలిగించవచ్చు. ట్రాన్స్‌మిషన్ హౌసింగ్ దెబ్బతింటే ఫ్లూయిడ్ లీకేజ్ సంభవించి, చివరికి ట్రాన్స్‌మిషన్ వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉందని సంస్థ స్పష్టం చేసింది. అయితే భారత్‌లో ఇప్పటివరకు ఇలాంటి సంఘటనలు నమోదు కాలేదని తెలిపింది.

**లెక్సస్ ఎల్ఎక్స్‌లోనూ ఇదే యూనిట్**

గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఇదే 10 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ యూనిట్‌ను లెక్సస్ ఎల్ఎక్స్ మోడల్‌లో కూడా ఉపయోగిస్తున్నారు. ఆ మోడల్‌కు సంబంధించి కూడా ఇలాంటి సమస్యల పరిష్కారానికి రీకాల్ జారీ చేసినట్లు కంపెనీ పేర్కొంది.

రీకాల్‌లో భాగమైన అన్ని వాహన యజమానులను టొయోటా డీలర్ ప్రతినిధులు వ్యక్తిగతంగా సంప్రదిస్తారు. అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ లేదా సరిదిద్దే చర్యలు ఉచితంగా చేపడతామని కంపెనీ వెల్లడించింది. కస్టమర్లు తమకు ఏవైనా సందేహాలు ఉంటే సమీప డీలర్‌ను లేదా కస్టమర్ అసిస్టెన్స్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించింది.

భారత్‌లో టొయోటా ల్యాండ్ క్రూయిజర్ 300 ఎక్స్‌షోరూమ్ ధర రూ. 2.15 కోట్లు. ఇందులో 3.3లీటర్ వి6 టర్బో డీజిల్ ఇంజిన్‌తో కూడిన 10స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ అందుబాటులో ఉంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 304 బీహెచ్‌పీ పవర్, 700 ఎన్ఎమ్ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.



## ప్రీమియం ఫీచర్లతో బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్

చైనా మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చింది. 'ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ 5జీ' పేరుతో భారత మార్కెట్‌లో విడుదల చేసింది. 6 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 21,999గా, 8 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 23,999గా, 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 25,999గా నిర్ణయించారు. లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు కార్డుల ద్వారా చేసే కొనుగోళ్లపై రూ.2 వేల వరకు అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్ లైన్ స్టోర్స్‌లో ఈ ఫిబ్రవరి 25నుంచి సేల్ అందుబాటులో ఉండనుంది. సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లర్ బ్లూ, లూనార్ టైటానియం కలర్స్‌లో మూడు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులో 6.78 అంగుళాల 1.5కే త్రీడీ కర్‌వ్డ్ అమోలెడ్ డిస్‌ప్లే, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్, ఐపీ65 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్ సర్టిఫికెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టం తదితర ఫీచర్లు ఉన్నాయి. వెనకవైపు 50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన డ్యుయల్ కెమెరా సెట్ అప్ ఉంది. ముందువైపు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 13 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది. 5జీ, డ్యూయల్ 4జీ వీఓఎల్ఈటీ కనెక్టివిటీ సపోర్టులున్నాయి. వై–ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఎన్ఎఫ్‌సీ ఉన్నాయి. యూఎస్‌బీ టైప్–సీ పోర్ట్, ఐఆర్ సెన్సార్ ఉన్నాయి. ఇన్–డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్‌లున్నాయి.

## విష్వక్సేన్ 'కల్ట్' టీజర్ ఇదిగో... వయొలెన్స్ ఓ రేంజిలో!



- విష్వక్సేన్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న 'కల్ట్'
- విడుదలైన ఇండియా తొలి స్లాషర్ మూవీ టీజర్
- గోవా పార్టీ నేపథ్యంలో హింసాత్మక కథాంశం
- సంగీతం అందిస్తున్న 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్
- టీజర్ లాంచ్‌లో జర్నలిస్టుతో విష్వక్సేన్ వాగ్వాదం

మాస్ కా దాస్ విష్వక్సేన్ నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కల్ట్'. "ఇండియాస్ ఫస్ట్ స్లాషర్ ఫిల్మ్" అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం హైదరాబాద్‌లో ఘనంగా విడుదల చేశారు. అత్యంత హింసాత్మకమైన, ఉత్కంఠభరితమైన విజువల్స్‌తో ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

టీజర్ ప్రకారం, గోవాలో స్నేహితులంతా కలిసి జరుపుకొనే ఓ పార్టీ, ప్రాణాలతో చెలగాటమాడే భయంకరమైన గేమ్‌గా మారుతుంది. ఈ గేమ్‌లో ఓడిన వారిని అతి కిరాతకంగా చంపేస్తుంటారు. ఈ డెడ్లీ గేమ్‌ను నడిపించే 'గేమ్ మాస్టర్' పాత్రలో విష్వక్సేన్ కనిపించారు. తలలు నరకడం వంటి రక్తపాతంతో కూడిన షాట్స్ సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో తెలియజేస్తున్నాయి.

విష్వక్సేన్ దర్శకత్వం వహిస్తున్న మూడో చిత్రమిది. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాయడం విశేషం. తారక్ సినిమాస్, వన్మయి క్రియేషన్స్ పతాకాలపై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హైదరాబాద్ ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో, సినిమాలోని కంటెంట్‌పై ఓ మహిళా జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు విష్వక్సేన్ ఘాటుగా స్పందించడం వాగ్వాదానికి దారితీసింది. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లోనూ విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



## రిషబ్ శెట్టి-ప్రశాంత్ వర్మ కాంబోలో 'జై హనుమాన్' ప్రారంభం

- 'హనుమాన్' సీక్వెల్ 'జై హనుమాన్' షూటింగ్ ప్రారంభం
- హనుమంతుడి పాత్రలో 'కాంతార' ఫేమ్ రిషభ్ శెట్టి
- ఆంజనేయుడి జన్మస్థలం అంజనాద్రిలో పూజా కార్యక్రమాలు
- ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం
- తేజా సజ్జాతో పాటు పలువురు సినీ ప్రముఖుల హాజరు

హనుమాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్‌లోని తదుపరి చిత్రం 'జై హనుమాన్'ను అధికారికంగా ప్రారంభించారు. కర్ణాటకలోని హంపి సమీపంలో, ఆంజనేయుడి జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన అంజనాద్రి బెట్టపై పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంఛనంగా మొదలైంది. ఈ చిత్రంలో హనుమంతుడి కీలక పాత్రను 'కాంతార' ఫేమ్, జాతీయ అవార్డు గ్రహీత రిషభ్ శెట్టి పోషిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రిషభ్ శెట్టి తన భార్య ప్రగతి శెట్టితో కలిసి హాజరయ్యారు. 'హనుమాన్' హీరో తేజా సజ్జా, దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాతలు పాల్గొన్నారు. ముహూర్తపు షాట్‌కు ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ క్లాప్ కొట్టగా, అనిల్ థడానీ కెమెరా స్విచాన్ చేశారు. స్క్రిప్ట్ అందుకున్న సమయంలో రిషభ్ శెట్టి భక్తిభావంతో కనిపించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని టీసిరీస్ సమర్పిస్తోంది. 2024 సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'హనుమాన్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అత్యాధునిక సాంకేతికత, గ్రాఫిక్స్‌తో భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు. గౌర హరి సంగీతం అందిస్తున్న ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# అసౌకర్యంగా అనిపించేది

## మరోసారి సౌత్ ఇండస్ట్రీపై తాప్సీ

- సౌత్ ఇండస్ట్రీపై తాప్సీ సంచలన వ్యాఖ్యలు
- గ్లామర్ సన్నివేశాలపై ఒత్తిడి ఆరోపణలు
- సెట్స్‌లో అసౌకర్యంగా అనిపించేది: తాప్సీ
- కంగనా వివాదంపై క్లారిటీ ఇచ్చిన నటి
- టాలీవుడ్‌లో గుర్తింపు రాలేదని ఆవేదన





నటి తాప్సీ దక్షిణాది చిత్ర పరిశ్రమపై మరోసారి కామెంట్స్ చేశారు. తన కొత్త సినిమా 'అస్సీ' (Assi) ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సౌత్ ఇండస్ట్రీలో తాను ఇబ్బంది పడినట్లు తెలిపారు. గ్లామర్ సన్నివేశాలు, పాటలకు సంబంధించి.. మరింత ఆకర్షణీయంగా కనిపించాలనే ఉద్దేశంతో ప్యాడెడ్ బ్రా ధరించాలని సౌత్ ఫిల్మ్‌మేకర్స్ తనపై ఒత్తిడి తెచ్చేవారని ఆరోపించారు. సినిమా సెట్స్‌లో వందలాది మంది ముందు ఇలాంటివి చెప్పడం అసౌకర్యంగా అనిపించేదన్నారు. దక్షిణాది, భోజ్‌పురి సినీ పరిశ్రమల్లో హీరోయిన్ల నాభిపై ఎక్కువగా దృష్టి పెడతారని వ్యాఖ్యానించారు. తాప్సీ కామెంట్లపై నెట్టింట చర్చ జరుగుతోంది.

**ఎవరితోనూ గొడవపడలేదు..**

కంగనా రనౌత్ తాప్సీకి మధ్య విభేదాలు తలెత్తాయంటూ గతంలో వార్తలొచ్చాయి. దీనిపై స్పందిస్తూ "ఇద్దరు వ్యక్తులు గొడవ పడితేనే ఫైట్ అంటుంటాం. కానీ, నేను ఎప్పుడూ ఎవరితోనూ గొడవపడలేదు. ఆమెకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆమె సోదరి నన్ను 'చీప్ కాపీ' అని వ్యాఖ్యానించింది. ఒకవేళ కంగనా గొప్ప నటి అయితే.. చీప్ కాపీ అని పిలిపించుకోవడంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు'' అని తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

ప్రస్తుతం బాలీవుడ్‌కి పరిమితమైన తాప్సీ.. దక్షిణాది చిత్ర పరిశ్రమపై గతంలో పలుమార్లు కామెంట్లు చేసిన సంగతి తెలిసిందే. సౌత్‌లో నటించడం వల్ల తనకు తగిన గుర్తింపు రాలేదన్నారు. ఇక్కడ స్టార్ హీరోయిన్‌గా కొనసాగినప్పటికీ సంతృప్తి అనిపించిన క్యారెక్టర్స్ లభించలేదన్నారు. తెలుగు మూవీ 'ఝుమ్మంది నాదం'తో ఆమె హీరోయిన్‌గా పరిచయమయ్యారు. టాలీవుడ్‌లో ఆమె చివరి సినిమా 2022లో వచ్చిన 'మిషన్ ఇంపాజిబుల్'.

## ఒకేసారి నాలుగు చిత్రాలతో విక్రమ్



పాత్రలతో ప్రయోగాలు చేసే కథానాయకుల్లో ముందు వరుసలో ఉంటారు హీరో విక్రమ్. ఈ మధ్య కాలంలో 'తంగలాన్', 'వీర ధీర శూర్' లాంటి వైవిధ్యమైన సినిమాలతో అలరించినా.. ఏదీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. కానీ ఈ ఏడాది అదిరిపోయే కథలతో రావడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారాయన. తాజాగా విక్రమ్.. ఒకేసారి నాలుగు చిత్రాల్ని ప్రకటించి సినీప్రియుల్ని ఆశ్చర్యపరిచారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాల్ని పూర్తిగా వెల్లడించనప్పటికీ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఈ విషయం గురించి ఓ పోస్ట్ పెట్టారాయన. "కొన్నిసార్లు నిశ్శబ్దం కూడా ఒకలాంటి ప్రిపరేషన్ లాంటిదే. ఈ సంవత్సరం నన్ను కదిలించే కథల కోసం ఎదురుచూస్తూ గడిపాను. నేను ఎంతో ఆరాధించే దర్శకులతో విభిన్నమైన నాలుగు చిత్రాలతో రాబోతున్నాను. ఈ ప్రయాణాలను మీతో పంచుకోవడానికి వేచి ఉండలేన''ని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మరి ఆ 4 సినిమాల కథలు, దర్శకుల వివరాలు తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## రాజ్‌పాల్ యాదవ్ కేసులో కొత్త కోణం.. వివాదం వెనుక బిగ్ బీ?


- ఆర్థిక వివాదంలో నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట
- అమితాబ్‌తో స్టేజ్ పంచుకోనివ్వలేదనే కోపంతోనే వివాదం మొదలైందని లాయర్ వెల్లడి
- రూ.5 కోట్ల అప్పు కేసులో రాజ్‌పాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు
- మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకుంటామని కోర్టుకు తెలిపిన నటుడు



బాలీవుడ్ ప్రముఖ హాస్యనటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు సంబంధించి దశాబ్దకాలంగా కొనసాగుతున్న ఆర్థిక వివాదంలో ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. వ్యాపారవేత్త మాధవ్ గోపాల్ అగర్వాల్‌తో ఉన్న కేసులో కోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ వివాదానికి కేవలం డబ్బు మాత్రమే కారణం కాదని, దీని వెనుక బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌కు సంబంధించిన ఓ సంఘటన ఉందని రాజ్‌పాల్ తరపు న్యాయవాది వెల్లడించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.రాజ్‌పాల్ యాదవ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'అతా పతా లాపతా' (2012) సినిమా కోసం వ్యాపారవేత్త మాధవ్ గోపాల్ నుంచి రూ.5 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఆ సినిమా మ్యూజిక్ లాంచ్‌కు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో బిగ్ బీతో కలిసి వేదిక పంచుకోవాలని మాధవ్ ఆశపడ్డారని, కానీ అందుకు తాము అంగీకరించకపోవడంతో ఆయన ఆగ్రహానికి గురయ్యారని రాజ్‌పాల్ లాయర్ కోర్టుకు తెలిపారు. ఆ కోపంతోనే ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అప్పుడే కేసు పెట్టారని వివరించారు. వాస్తవానికి రూ.5 కోట్ల అప్పు వడ్డీలతో కలిపి రూ.10.40 కోట్లకు చేరగా, రాజ్‌పాల్ ఇప్పటికే రూ.1.90 కోట్లు చెల్లించారు. మిగిలిన మొత్తానికి బదులుగా రూ.15 కోట్ల విలువైన ఆస్తిని గ్యారెంటీగా ఇచ్చేందుకు ఒకరు ముందుకొచ్చినా, ఫిర్యాదుదారుడు అంగీకరించలేదని న్యాయవాది పేర్కొన్నారు. డబ్బు కంటే రాజ్‌పాల్‌కు జైలు శిక్ష పడాలన్నదే వారి ఉద్దేశమని ఆరోపించారు. గతంలో ఇచ్చిన చెక్కులను బ్యాంకులో వేయడంతో ఈ వివాదం ముదిరి, ట్రయల్ కోర్టు రాజ్‌పాల్‌కు మూడు నెలల జైలు శిక్ష విధించింది. దీనిపై అప్పీల్ చేయగా, తాజాగా హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని రాజ్‌పాల్ తరపు బృందం కోర్టుకు విన్నవించింది. కేసు విచారణ కొనసాగుతోంది.

## సమంత 'మా ఇంటి బంగారం' వచ్చేది అప్పుడే!

- సమంత నటిస్తున్న 'మా ఇంటి బంగారం'రిలీజ్ డేట్ ఖరారు
- ఈ ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న చిత్రం
- కొత్త పోస్టర్‌తో సోషల్ మీడియా ద్వారా తేదీని ప్రకటించిన సమంత
- ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్న సమంత
- నందిని రెడ్డి దర్శకత్వంలో సినిమా




ప్రముఖ నటి సమంత నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఖరారైంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాను ఈ ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని సమంత స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

కొత్త పోస్టర్‌లో సమంత ఓ తలుపు చాటు నుంచి ఆసక్తిగా తొంగిచూస్తూ కనిపించారు. ఈ పోస్టర్‌ను పంచుకుంటూ, "ఈ వేసవిలో థియేటర్లలో కలుద్దాం, బంగారాలు.. మే 15న 'మా ఇంటి బంగారం'ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలవుతోంది" అని ఆమె క్యాప్షన్ జోడించారు.

నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను జనవరిలో విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. బస్సులో బ్రౌన్ కలర్ చీరలో నిలబడి, పోరాటానికి సిద్ధమైనట్లుగా ఉన్న సమంత లుక్ సినిమాపై అంచనాలను పెంచింది.ఈ సినిమా గురించి సమంత మాట్లాడుతూ, "ఇది కుటుంబానికి ప్రాధాన్యతనిచ్చే ఎమోషనల్ కథ. ఒక మహిళ బలం ఆమె ధైర్యం నుంచే కాదు, బలహీనత నుంచి కూడా వస్తుందని ఈ చిత్రం చెబుతుంది. ఈ పాత్రలో నటించడం, నిర్మాతగా ఈ సినిమాను నిర్మించడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది" అని తెలిపారు. సరదాగా, ఉత్కంఠగా సాగే ఈ కథ ప్రేక్షకులకు తప్పకుండా కనెక్ట్ అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.కాగా, సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరులతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



### 'ఉస్తాద్ భగత్‌సింగ్'.. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' వచ్చేసింది

గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ (Pawan Kalyan)- డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్' (Ustaad Bhagat Singh). మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇటీవల 'ఆరా ఆఫ్ ఉస్తాద్' (Aura Of Ustaad) ప్రోమోను పంచుకున్న టీమ్.. తాజాగా పూర్తిపాటను విడుదల చేసింది. పవన్ కల్యాణ్ మ్యానరిజం, ప్రేక్షకుల్లో ఆయనకున్న క్రేజ్‌ను ప్రతిబింబించేలా చంద్రబోస్ రాసిన ఈ పాటను దేవిశ్రీ ప్రసాద్, ఎస్పీ అభిషేక్ పాడారు. సంగీతం కూడా దేవిశ్రీ ప్రసాదే.

# 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, నటిగా నివేతా థామస్



- కొచ్చి వేదికగా 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ప్రదానోత్సవం
- అత్యధికంగా పుష్ప 2 చిత్రానికి అవార్డులు
- ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, సహాయ నటుడిగా అమితాబ్ బచ్చన్

70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ప్రదానోత్సవం కొచ్చి వేదికగా అట్టహాసంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. 'పుష్ప 2: ది రూల్' కోసం ఉత్తమ నటుడు (తెలుగు) అవార్డును అల్లు అర్జున్ అందుకున్నారు. అల్లు అర్జున్‌కు ఇది ఏడవ ఫిల్మ్ ఫేర్ అవార్డు కావడం గమనార్హం. మెగాస్టార్ చిరంజీవి పేరిట ఉన్న దీర్ఘకాల రికార్డును అల్లు అర్జున్ సమం చేశారు.

'35: చిన్న కథ కాదు' చిత్రానికి గాను నివేతా థామస్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. 'పుష్ప-2' సినిమాకు ఎక్కువ అవార్డులు వచ్చాయి. టాలీవుడ్‌కు పలు అవార్డులు దక్కాయి.

ఉత్తమ చిత్రం: పుష్ప 2 ఉత్తమ దర్శకుడు: సుకుమార్ (పుష్ప 2) ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్: పుష్ప 2 ఉత్తమ సహాయ నటుడు: అమితాబ్ బచ్చన్ (కల్కి2898 ఏడీ) ఉత్తమ సహాయ నటి: అంజలి (గ్యాంగ్ ఆఫ్ గోదావరి) ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు) ఉత్తమ పరిచయ నటి: నయన్ సారిక (గం గం గణేశా) ఉత్తమ సాహిత్యం: చుట్టమల్లే చుట్టేస్తోంది (దేవర) ఉత్తమ గాయకుడు: శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టె, గుంటూరు కారం) ఉత్తమ గాయని: శిల్పారావు (చుట్టమల్లె చుట్టేస్తోంది) ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: నితిన్ జిహానీ (కల్కి 2898 ఏడీ), రామకృష్ణ, మోనిక (పుష్ప2) ఉత్తమ కొరియోగ్రాఫర్: శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి) ఉత్తమ చిత్రం (క్రిటిక్స్): లక్కీ భాస్కర్ఉ త్తమ నటుడు (క్రిటిక్స్): తేజ సజ్జా ఉత్తమ నటి (క్రిటిక్స్): కాజల్ అగర్వాల్ (సత్యభామ)

## సత్తా చాటిన 'అమరన్', 'భ్రమయుగం'

### .. మమ్ముట్టి, శివకార్తికేయన్ బెస్ట్ యాక్టర్స్



అమరన్ భ్రమయుగం సినిమాలు సత్తా చాటాయి. 'అమరన్'కు ఎనిమిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, 'భ్రమయుగం' చిత్రానికి రెండు పురస్కారాలు దక్కాయి. వీటిలో నటించిన హీరోలను ఉత్తమ నటుడు అవార్డులు వరించాయి. శనివారం రాత్రి కొచ్చిలో జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల వేడుకలో విజేతలు వాటిని స్వీకరించారు. కేరళ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తారాలోకం తరలివచ్చింది. 2024లో విడుదలైన దక్షిణాది సినిమాలకు అవార్డులు ప్రదానం చేశారు తమిళం, మలయాళం, కన్నడ చిత్ర పరిశ్రమకు సంబంధించిన పురస్కారాల్లో కొన్ని ఇవీ..

తమిళం బెస్ట్ యాక్టర్ మేల్: శివ కార్తికేయన్ (అమరన్) బెస్ట్ యాక్టర్ ఫిమేల్: సాయి పల్లవి (అమరన్) బెస్ట్ ఫిల్మ్: అమరన్ బెస్ట్ డైరెక్టర్: రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్), పీఎస్ వినోద్‌రాజ్ (కొట్టుక్కాళి) బెస్ట్ యాక్టర్ ఇన్ సపోర్టింగ్ రోల్ మేల్: కార్తి (మెయ్యళగన్) బెస్ట్ యాక్టర్ ఇన్ సపోర్టింగ్ రోల్ ఫిమేల్: పార్వతీ తిరువోతు (తంగలాన్), శ్వాసిక (లబ్బర్ పందు) మలయాళం బెస్ట్ యాక్టర్ మేల్: మమ్ముట్టి (భ్రమయుగం) బెస్ట్ యాక్టర్ ఫిమేల్: ఊర్వశి (ఉల్లొళుక్కు) బెస్ట్ ఫిల్మ్: మంజుమ్మల్ బాయ్స్ బెస్ట్ డైరెక్టర్: రాహుల్ సదాశివన్ (భ్రమయుగం) బెస్ట్ యాక్టర్ ఇన్ సపోర్టింగ్ రోల్ మేల్: విజయరాఘవన్ (కిష్కింద కాండం) బెస్ట్ యాక్టర్ ఇన్ సపోర్టింగ్ రోల్ ఫిమేల్: లిజోమోల్ జోస్ (హర్) కన్నడ బెస్ట్ యాక్టర్ మేల్: శ్రీమురళి (బఘీర) బెస్ట్ యాక్టర్ ఫిమేల్: అక్షత (కోలీ ఎసరు) బెస్ట్ ఫిల్మ్: శాఖాహారి బెస్ట్ డైరెక్టర్: పృథ్వీ కొననూర్ (హదినెలెంతు) బెస్ట్ యాక్టర్ ఇన్ సపోర్టింగ్ రోల్ మేల్: గోపాల్‌కృష్ణ దేశ్‌పాండే (బ్లింక్) బెస్ట్ యాక్టర్ ఇన్ సపోర్టింగ్ రోల్ ఫిమేల్: ప్రియ (భీమ)

## కొడుక్కి రూ.4 కోట్ల గిఫ్ట్ ఇచ్చిన హార్దిక్..
# పక్కనే నటాషా




భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్య తన కుమారుడికి ఖరీదైన బహుమతి ఇచ్చాడు. ఐదేళ్ల అగస్త్యకు ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారును గిఫ్ట్‌గా అందించాడు. దీని విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుంది. ముంబయిలోని ఓ కారు షోరూమ్‌లో అగస్త్య కారు కీని అందుకున్నాడు. ఆ సమయంలో అగస్త్య తల్లి నటాషా సైతం అక్కడే ఉంది. దీనికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 2020లో నటాషా స్టాంకోవిచ్‌ను వివాహమాడిన హార్దిక్.. 2024లో విడిపోయారు. మరోవైపు హార్దిక్.. మహిక శర్మతో రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఆమెతో అనుబంధానికి గుర్తుగా హార్దిక్.. తన మెడపై రెండు చిరుత చిత్రాలతో పాటు వాటి మధ్యలో 'ఎం' అనే అక్షరాన్ని పచ్చబొట్టు వేయించుకున్నాడు.

## ప్రి సీడింగ్ సిస్టమ్‌పై విమర్శలు..
# సూర్యకుమార్ ఏమన్నాడంటే..?





**టీ20 ప్రపంచకప్ (T20 World Cup)లో టీమ్ఇండియా సూపర్ 8 సమరం నేటి నుంచే ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా (IND vs SA)తో భారత్ తలపడనుంది. అయితే.. సూపర్ 8 'ప్రి సీడింగ్' విధానం (Super 8 Seeding Controversy) పై సోషల్‌మీడియా వేదికగా విమర్శలు వస్తున్నాయి .దీనిపై టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (Suryakumar Yadav) స్పందించాడు.**

సూపర్ 8 మ్యాచ్ నేపథ్యంలో 'ప్రి సీడింగ్' విధానంపై సూర్యకుమార్ మాట్లాడుతూ.. ''ఈ సీడింగ్‌ను ఎవరు చేస్తారో నాకు తెలియదు. ఒకవేళ నేను ఆ స్థానంలో ఉంటే.. కచ్చితంగా సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తాను. గతంలో కూడా నేను ఇదే చెప్పాను'' అని స్పష్టం చేశాడు. ఇక వేదికలకు అలవాటు పడటం గురించి మాట్లాడుతూ.. ఆటగాళ్లు ఐపీఎల్ ఆడుతుండటంతో ఆ విషయంలో ఎలాంటి సమస్య ఉండదన్నాడు. ఐపీఎల్‌కి ఎవరు వచ్చినా.. అన్ని వేదికల్లో ఆడారని గుర్తుచేశాడు. రెండు సూపర్ 8 గ్రూపులను నిర్ణయించడానికి ఉపయోగించిన ప్రి సీడిండ్ సిస్టమ్‌పై.. అభిమానులు, విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. టోర్నీకి ముందే 8 జట్లకు సూపర్ 8లో సీడింగ్ కేటాయించారు. ఆ జట్లు సూపర్ 8కు అర్హత సాధిస్తే ఆ స్థానాల్లోనే ఆడతాయి. గ్రూప్ దశలో ఆ జట్ల ఆటతీరు సూపర్ 8 స్థానాలపై ప్రభావం చూపించదు. సీడింగ్ ద్వారానే సూపర్ 8లో స్థానాలను నిర్ణయించారు. భారత్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ ఒకే గ్రూప్‌లోకి వచ్చాయి. ఈ నాలుగు జట్లు లీగ్ దశలో తమ గ్రూప్‌ల్లో టాప్‌లో ఉన్నాయి. దీంతో గ్రూప్ దశలో గొప్పగా రాణించిన జట్లకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించలేదని పలువురు ప్రశ్నించారు.

**ఇప్పుడే ఎందుకు విమర్శలు..?**

ప్రి సీడింగ్ విధానంపై మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా స్పందించాడు. దీనిపై ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించాడు. ''టోర్నమెంట్ ప్రారంభానికి ముందు ఈ ప్రశ్నలు ఎందుకు లేవనెత్తలేదు..? ఇప్పుడే ఎందుకు ప్రస్తావిస్తున్నారు..? ఐసీసీ దీనిని బాగా వివరించగలదు. రెండు దేశాల్లో టోర్నీ నిర్వహించడం.. మ్యాచ్‌ల షెడ్యూల్.. ఆటగాళ్ల ప్రయాణాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని అనుకుంటున్నా'' అని గావస్కర్ అన్నాడు.

# క్లాబో.. ఆరో స్వర్ణం



నార్వే అథ్లెట్ జొహానెస్ క్లాబో వింటర్ ఒలింపిక్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. పురుషుల క్రాస్ కంట్రీ స్కీయింగ్ పోటీల్లో ఆరోసారి విజేతగా నిలిచి.. ఒక వింటర్ ఒలింపిక్స్‌లో ఆరు స్వర్ణాలు గెలిచిన తొలి అథ్లెట్‌గా ఘనత సాధించాడు.

శనివారం 50 కిలోమీటర్ల రేసులో అగ్రస్థానం సాధించాడు. క్లాబో సహచరులు మార్టిన్ లూవ్‌స్ట్రామ్ రజతం, ఇవర్సెన్ కాంస్యం గెలిచారు. అమెరికా అథ్లెట్ ఎరిక్ హెయిడెన్ (అయిదు స్వర్ణాలు) పేరిట 50 ఏళ్ల క్రితం నమోదైన రికార్డును క్లాబో అధిగమించాడు. అయితే అతను ఆరు స్వర్ణాల్లో రెండు టీమ్ పోటీల్లో గెలవగా.. ఎరిక్ అయిదింటినీ వ్యక్తిగత విభాగాల్లోనే సాధించడం విశేషం. వింటర్ ఒలింపిక్స్‌లో 18 స్వర్ణాలు గెలిచిన నార్వే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 11 స్వర్ణాలతో అమెరికా రెండో స్థానంలో ఉంది.

# టీమిండియా ఘోర పరాజయం

- టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో టీమిండియాకు భారీ ఓటమి
- 76 పరుగుల తేడాతో చిత్తు చేసిన దక్షిణాఫ్రికా
- 188 పరుగుల లక్ష్య ఛేదనలో 111 పరుగులకే భారత్ ఆలౌట్
- ఒంటరి పోరాటం చేసిన శివమ్ దూబే.. విఫలమైన కీలక బ్యాటర్లు
- సఫారీ బౌలర్లలో మార్కో యాన్సెన్‌కు 4 వికెట్లు, బ్యాటింగ్‌లో మిల్లర్ అర్ధశతకం




**టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 పోరులో టీమిండియాకు ఘోర పరాజయం ఎదురైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 76 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్‌లో సమష్టిగా రాణించిన సఫారీ జట్టు.. టీమిండియాను అన్ని విభాగాల్లోనూ దెబ్బతీసి అద్భుత విజయాన్ని అందుకుంది.**

188 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఇషాన్ కిషన్ (0) డకౌట్‌గా వెనుదిరగగా, ఆ వెంటనే తిలక్ వర్మ (1) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అభిషేక్ శర్మ (15), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (18) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. వాషింగ్టన్ సుందర్ (11) కూడా విఫలమయ్యాడు.

ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆల్‌రౌండర్ శివమ్ దూబే (37 బంతుల్లో 42) ఒంటరి పోరాటం చేశాడు. అయితే అతనికి హార్దిక్ పాండ్యా (18) మినహా మరెవరి నుంచీ సహకారం అందలేదు. రింకూ సింగ్ (0) డకౌట్ కావడం జట్టును మరింత దెబ్బతీసింది. దీంతో భారత జట్టు 18.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 4 వికెట్లతో చెలరేగగా, కేశవ్ మహరాజ్ 3, కార్బిన్ బాష్ 2 వికెట్లు పడగొట్టారు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆరంభంలో గట్టి షాక్ తగిలింది. జస్‌ప్రీత్ బుమ్రా అద్భుత బౌలింగ్‌తో క్వింటన్ డి కాక్ (6), ర్యాన్ రికెల్టన్ (7)లను ఔట్ చేయగా, అర్షదీప్ సింగ్ కెప్టెన్ మార్‌క్రమ్ (4)ను పెవిలియన్ పంపాడు. దీంతో సఫారీ జట్టు 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో డెవాల్డ్ బ్రెవిస్ (45), డేవిడ్ మిల్లర్ (63) అద్భుత భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ముఖ్యంగా మిల్లర్ కేవలం 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (24 బంతుల్లో 44 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 3 వికెట్లతో అద్భుతంగా రాణించాడు.

**సూపర్-8 దశలో భారత్ తన తదుపరి మ్యాచ్ ను ఈ నెల 26న జింబాబ్వేతో ఆడనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరగనుంది.**

# ధోనీ అభిమానులకు శుభవార్త చెప్పిన సీఎస్కే

- ఐపీఎల్ 2026లోనూ ఆడనున్న ఎంఎస్ ధోనీ
- అధికారికంగా స్పష్టం చేసిన సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్
- ధోనీ భవిష్యత్తుపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెర
- 'తలా' నిర్ణయంతో యెల్లో ఆర్మీలో వెల్లువెత్తిన ఆనందం



చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) అభిమానులకు ఇది నిజంగా శుభవార్త. గత కొన్ని సీజన్లుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ, లెజెండరీ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ 2026లో కూడా ఆడతాడని ఫ్రాంచైజీ సీఈఓ కాశీ విశ్వనాథన్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ధోనీ భవిష్యత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు పూర్తిస్థాయిలో ఫుల్‌స్టాప్ పడింది.


ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి సుమారు నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో, ధోనీ భవిష్యత్తుపై సీఈఓ స్పష్టత ఇచ్చారు. "అతను ఆడతాడు, ఈ సీజన్ లో తప్పకుండా ఆడతాడు" అంటూ విశ్వనాథన్ చేసిన వ్యాఖ్యలతో 'యెల్లో ఆర్మీ'లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ధోనీ సీఎస్కేకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మధ్యలో రెండేళ్ల పాటు జట్టుపై నిషేధం విధించినప్పుడు మాత్రమే రైజింగ్ పుణె సూపర్ జెయింట్ తరఫున ఆడాడు. 44 ఏళ్ల వయసులోనూ జట్టుకు మార్గదర్శకత్వం అందిస్తూ, ఐదుసార్లు సీఎస్కేను ఛాంపియన్‌గా నిలబెట్టిన ఘనత ధోనీది. ఇటీవల కామెంటరీ గురించి మాట్లాడుతూ, అది చాలా కష్టమైన పని అని, ఆటగాళ్లను విమర్శించకుండా వ్యాఖ్యానం చేయడం సవాలుతో కూడుకున్నదని పేర్కొన్నాడు.

**2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, ఐపీఎల్‌లో ధోనీ ప్రభావం తగ్గలేదు. మార్చి చివరిలో మొదలుకానున్న ఐపీఎల్ 2026లో 'తలా'ను మరోసారి మైదానంలో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.**

## స్పిన్ ఉచ్చుకు బలైన శ్రీలంక..
# సూపర్ 8లో ఇంగ్లండ్ అద్భుత విజయం

- టీ20 వరల్డ్ కప్ సూపర్-8
- శ్రీలంకపై ఇంగ్లండ్ 51 పరుగుల తేడాతో గెలుపు
- 147 పరుగుల లక్ష్య ఛేదనలో 95 పరుగులకే కుప్పకూలిన లంక
- మూడు వికెట్లతో లంక పతనాన్ని శాసించిన విల్ జాక్స్
- ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 62 పరుగులతో రాణించిన ఫిలిప్ సాల్ట్
- లంక బౌలర్లలో దునిత్ వెల్లలాగేకు మూడు వికెట్లు



టీ20 ప్రపంచకప్ సూపర్ 8 పోరులో ఇంగ్లండ్ జట్టు శ్రీలంకపై 51 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో శ్రీలంక పూర్తిగా విఫలమైంది. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 16.4 ఓవర్లలో కేవలం 95 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై లంకేయులకు ఇది దిగ్భ్రాంతి కలిగించే పరాజయం. 147 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు పతుమ్ నిస్సంక (9), కమిల్ మిషార (6) త్వరగా వెనుదిరిగారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కుశాల్ మెండిస్ (4), పవన్ రత్నాయకే (0), దునిత్ వెల్లలాగే (10) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. కేవలం 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది.

కెప్టెన్ దసున్ షనక (30 పరుగులు, 24 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసినా, అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. కమిందు మెండిస్ (13) కాసేపు నిలిచినా ఫలితం లేకపోయింది. ఇంగ్లండ్ బౌలర్ల క్రమశిక్షణాయుత బౌలింగ్‌కు లంక బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. స్పిన్నర్ విల్ జాక్స్ కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో లంక పతనాన్ని శాసించగా, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ జోస్ బట్లర్ (7) విఫలమయ్యాడు. అయితే, ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (62 పరుగులు, 40 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, సాల్ట్ దూకుడుగా ఆడి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. హ్యారీ బ్రూక్ (14), విల్ జాక్స్ (21) చివర్లో వేగంగా ఆడటంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో యువ స్పిన్నర్ దునిత్ వెల్లలాగే 26 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మహీశ్ తీక్షణ, దిల్షాన్ మధుశంక చెరో రెండు వికెట్లతో రాణించారు.

- టీ20 ప్రపంచకప్‌లో వర్షం కారణంగా రద్దయిన పాక్-న్యూజిలాండ్ సూపర్ 8 మ్యాచ్
- అత్యధిక టీ20 మ్యాచ్‌లు రద్దయిన జట్టుగా పాకిస్థాన్ చెత్త రికార్డు
- పాకిస్థాన్ ఖాతాలో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు రద్దు
- ప్రపంచకప్ చరిత్రలో పాకిస్థాన్‌కు ఇదే తొలి రద్దయిన మ్యాచ్
- గ్రూప్‌లో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించడంతో సెమీస్ రేసు సంక్లిష్టం

# టీ20 క్రికెట్: పాకిస్థాన్ ఖాతాలో అవాంఛనీయ రికార్డు

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో పాకిస్థాన్ ఓ అవాంఛనీయ రికార్డును తన పేరిట లిఖించుకుంది. టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా న్యూజిలాండ్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు కావడంతో ఈ రికార్డు నమోదైంది. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక మ్యాచ్‌లు రద్దయిన జట్టుగా పాకిస్థాన్ నిలిచింది.

కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, టాస్ వేసిన కొద్దిసేపటికే వర్షం ప్రారంభమైంది. మైదానం అంతా కవర్లతో కప్పి ఉంచినప్పటికీ, భారీ వర్షానికి పిచ్‌పై నీరు నిలిచిపోవడంతో ఆట కొనసాగించే పరిస్థితి లేకపోయింది. వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మ్యాచ్‌తో కలిపి... పాకిస్థాన్ ఆడిన టీ20 మ్యాచ్‌లలో ఏకంగా 7 మ్యాచ్‌లు రద్దయ్యాయి. ఈ జాబితాలో ఐర్లాండ్, న్యూజిలాండ్ (చెరో 6 మ్యాచ్‌లు) తర్వాతి స్థానాల్లో ఉండగా, భారత్, నెదర్లాండ్స్ (చెరో 4 మ్యాచ్‌లు) ఆ తర్వాత ఉన్నాయి. మ్యాచ్ రద్దు కావడంతో పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లకు చెరో పాయింట్ లభించింది. గ్రూప్ 2లో ఇంగ్లండ్, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న నేపథ్యంలో, ఇలా పాయింట్లు పంచుకోవడం ఇరు జట్ల సెమీస్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసే ప్రమాదం ఉంది. ఆసక్తికరంగా, టీ20 ప్రపంచకప్ చరిత్రలో పాకిస్థాన్‌కు ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడం ఇదే తొలిసారి. గత 2024 ప్రపంచకప్‌లో భారత్‌కెనడా మ్యాచ్ కూడా ఇదే విధంగా వర్షం వల్ల రద్దయిన విషయం తెలిసిందే.